# మనసు విలువ

ఆకాశం మేఘావృతమై వుంది. గాలి మందంగా వీస్తోంది. వర్షం వచ్చే సూచనలు కన్పిస్తున్నాయి.

రామస్వామి ఓసారి వీధిగుమ్మం దగ్గరికివచ్చి, కనుచూపు మేరవరకూ దృష్టిని సారించాడు. ఎక్కడా కొడుకు జాడ కనిపించలేదు. రైలు వచ్చే వేళకూడా అయ్యింది. ఇంతవరకూ వాడు ఇల్లు చేరకపోవడానికి కారణం యేమిటా అని ఆలోచిస్తూ, నిరాశా పూరితంగా నిట్టూరుస్తూ, లోపలికి వచ్చి కుర్చీలో కూలబడ్డాడు.

కొన్ని నిముషాలు గడిచాయి. బైట రిక్షా ఆగిన చప్పుడు కావడంతో, ఆత్రంగా బైటికి వచ్చి చూశాడు రామస్వామి. నిర్ఘాంతపోయాడు. రిక్షానుండి జానకి, ఆమె తండ్రి సీతా రామయ్యా దిగారు.

వారిని పలుకరించక తప్పింది కాదు రామస్వామికి. అయితే, ఆ పలుకరింపులో సంతోషం ధ్వనించలేదు. అప్పుడే చిన్న చిన్న తుంపర్లు ప్రారంభ మయ్యాయి. జానకి లోపలకు వెళ్ళిపోయింది. రామస్వామి, సీతారామయ్య ముందు గదిలో కూచున్నారు.

"మీరు వుత్తరం రాశారుగా బావగారూ, అబ్బాయి వస్తున్నట్లు: వెళ్దామంటూ జానకి ఒకటే పట్టుపట్టింది. నిజం చెప్పాలంటే, మేం యిక్కడికి రావడం, నాకు యేమీ యిష్టం లేదు సుమండీ: అతడి మన స్తత్వంలో మార్పువస్తే ఫరవాలేదు గాని పూర్వంలానే వుంటే, మేం వచ్చి ప్రయోజనం వుండదు సరికదా, అవమాన పడాల్సి వస్తుందేమోనన్న భయం నన్ను పీక్కు తింటుంది" అన్నాడు సీతారామయ్య, ప్రస్తావన ప్రారంభిస్తూ.

రామస్వామికి వియ్యంకుడిపట్ల సానుభూతి, జాలి వుద్భవించాయి. తనే ఆ స్థితిలోవుంటే యెట్లా బాధపడేవాడో, ఒక్కసారి వూహించుకునే సరికి, అతని హృదయం ద్రవించి పోయింది. కొడుకు మీద కోపం వుప్పెనలా ప్రవహించింది.

"కేవలం వాడి రాక గురించి మీకు తెలియజెయ్యా లనుకునే మీకు ఉత్తరం రాశాను బావగారూ! అంతేగాని, మీరు జానకిని తీసుకుని వచ్చేస్తారని అనుకోలేదు. అబ్బాయి ఇల్లుచేరుకున్నాక, వాడి మన స్తత్వపు లోతులు గ్రహించి, మీకు మళ్ళీ రాద్దామనుకున్నాను."

"నా అభిప్రాయమూ అదేనండీ! కాని, జానకి ఆసక్తిని కొట్టిపారేయలేక పోయాను. ఆమెలో అవ్యక్తంగా వున్న ఆవేదన యెటువంటిదో, నాకు తెలుసు...దాని ఆసక్తినికాదని, ఇంకా బాధపెట్టడం యిష్టంలేకనే, రావాల్సి వచ్చింది. ఐతే, అబ్బాయి ఇంకా రాలేదా?"

"లేదండీ! వాడు వస్తాడనే ఎదురు చూస్తున్నాను. అన్నట్టు మీరు బస్సులో వచ్చారా?"

"ఔను బావగారూ!"

జానకి, కాఫీ తీసుకొచ్చింది రామస్వామి, కోడలి మొహంలోకి పరిశీలనగా చూచాడు. మేఘావృత మైన చందమామలా వుందామె మొహం. పాపం, యీ పిన్నవయస్సులోనే ఆ వేదనకి గురయ్యిందని బాధపడ్డాడు.

"నువ్వే తీసుకొచ్చావేమిటమ్మా! వంటమనిషి లేదూ?" అంటూ కాఫీ తీసుకున్నాడు రామస్వామి.

"ఫరవాలేదులెండి బావగారూ! ఎవరింటిపని వారు చేసుకోవడంలో తప్పేముంది?" నవ్వుతూ తనూ కాఫీ అందుకున్నాడు సీతారామయ్య.

జానకి అక్కణ్ణించి వెళ్ళిపోయింది. "సరేగాని బావగారూ, అల్లుడు హఠాత్తుగా ఇలా మారిపోవటానికి కారణం యేమిటంటారు?" సీతారామయ్య అడిగాడు.

రామస్వామి ఓ నిట్టూర్పు వదిలాడు. "అదే నాకూ బోధపడ్డంలేదండీ! వివాహమైన కొత్తలో బాగానే వుండేవాడు. కలకత్తా వెళ్లివచ్చిన దగ్గర్నించి మారిపోయాడు. చీటికి, మాటికీ జానకితో రభసపడ్డం, ఆమెను ప్రతి విషయంలోనూ అవమానపర్చడం ప్రారంభమయ్యింది. నేను వారించడానికి ప్రయత్నించి, విఫలుణ్ణయ్యాను. అప్పుడేకదా, స్వయంగా జానకిని తీసుకొచ్చి

మీా యింట వదిలాడు. అంతే నాకు తెలిసిన విషయం. కారణం జానకికి తెలుసునేమో!"

"తెలీదంటోంది. ఐతే అది వూహిస్తున్న కారణం ఒక్కటే! ఆమె నవనాగరికంగా లేదనీ, విద్యాధికురాలు కాదనీ నిర్లక్ష్యం చేస్తున్నాడేమోనని. ఆ అభిప్రాయంతోనే, మళ్ళీ చదువుతానంది. నేనే అసమ్మతి తెలిపాను. మీారే చెప్పండి—యీా వయసులో అది చదవడ మేమిటి! వయసు మాట విస్మరించినా, వివాహిత కదా. ఇప్పుడది చదవడం నాకు మనస్కరించలేదు సుమండీ!"

వీధిలో రిక్షా ఆగిన శబ్దం వినిపించింది. ఇద్దరూ ఒకేసారి ఆత్రంగా బైటికి వచ్చారు. రామనాథం, నవనాగరికతకు మారు పేరులా వున్న ఓ యువతీ రిక్షానుండి దిగడం చూసి, వృద్ధు లిద్దరూ, మొహాలు చూసుకున్నారు. వారి మొహాల్లో కళ కాంతులు అదృశ్యమయ్యాయి.

రామనాథం, తండ్రినీ మామగార్నీ చూశాడు. మామ గారు ఆ క్షణంలో అక్కడ వుండటం, అతనికి యెంతో వుద్రేకం కలిగించింది. అయితేనేం సమయం దృష్టిలో ఉంచుకొని, తమాయించుకున్నాడు.

సీతారామయ్య కళ్ళు, నిప్పుకణాల్లా ప్రజ్వలిస్తున్నాయి. రామస్వామిలో ఆవేశమూ, అవమానమూ, సంఘర్షణ పడుతున్నాయి. అతని మొహం పాలిపోయింది.

"ఎవర్రా యీామె?" గంభీరంగా అడిగాడు.

రామనాథం తండ్రి గంభీరతకు గాని, అతని కటువు కంఠస్వరానికిగాని, చెక్కుచెదర లేదు.

"మీ కోడలు నాన్నా!" అంటూ ఆమె కేసి తిరిగి "పద్మా, హి యీజ్ మై ఫాదర్" అంటూ పరిచయం చేశాడు.

పద్మ మందహాసంతో నమస్కారం చేసింది. రామస్వామి ప్రతినమస్కారం చెయ్యలేదు. కోపంతో అతనివళ్లు దహించుకు పోతోంది. తీక్షణంగా ఆమె కేసి చూశాడు. నుదుట బొట్టులేదు. కాని పాపిటె మధ్య సింధూరం కొట్టవచ్చినట్టు కనిపించింది. బహుశా ఆమె ఆంధ్రవనిత కాదేమోనని అభిప్రాయ పడ్డాడు. ఆ ముసలాయన మొహం మ్లానమయ్యింది. ఎంత సాహసం! ఎంత వంచన! జానకికి అన్యాయంచేసి మరో అమ్మాయిని పెళ్ళాడ్డంలో కొడుకు క్రూరత్వం అర్థమయ్యింది.

"ఏమిటీ నీ ధైర్యం?" అన్నాడు కోపంగా రామస్వామి.

తన కూతురికి జరుగుతున్న అన్యాయానికి యెంతో బాధపడ్డాడు సీతారామయ్య. జానకి, జీవితాంతమూ కుమిలి పోతూవుంటే, చూస్తూ యెలా సహించగలడు తను! అతని కళ్లు నీళ్ళపర్యంతమయ్యాయి.

"నువ్వు చేసినపని, యేమీ సబబుగా లేదు నాథం. జానకికి అన్యాయం చేస్తున్నావని గుర్తుకు రావడమే లేదా నీకు? ఒక్కసారి ఆలోచించు. ఆమె తండ్రిగా నే నెంతగా పరితపిస్తున్నానో, నీకు యెలా తెలియజెయ్యడం?"

రామనాథం యెవరిమాటలూ వినేస్థితిలో లేడు. అతని చెక్కిళ్లు కోపంతో యెరుపెక్కాయి. మామగారివేపు తీక్ష్ణంగా చూశాడు.

"నేను యెవ్వరికీ అన్యాయం చెయ్యలేదు. నాకు నచ్చిన అమ్మాయిని వివాహం చేసుకుందుకు, నాకు అధికారం ఉంది. ఈమె ఆంధ్రవనిత కాకపోయినా, ఈమెలోని సంస్కారం, నన్ను యిట్టే ఆకర్షించింది. సంస్కారమే కాదు, ఈమె అందం నన్ను మైమరపించింది. బాగా చదువుకుంది. భార్యగా నేను కోరుకున్న వ్యక్తి ఇప్పటికి లభ్యమయ్యింది. ఈమె ముందు, జానకి బలాదూర్..." అన్నాడు అహంభావంతో.

కన్నకూతుర్ని కించపరుస్తూ, వంచిస్తూ వుంటే, ఏ తండ్రి మాత్రం వూరుకో గలడు? సీతారామయ్యలోని సహనం పట్టుతప్పింది. ప్రాధేయతతో, మంచితో సాధించవల్సిన తరుణం దాటిపోయిందనుకున్నాడు.

"నువ్వు అంటే సరిపోయిందా? అగ్నిసాక్షిగా పెళ్లాడిన భార్య ఉండగా, మరో అమ్మాయిని యెలా వివాహం చేసుకుంటావో, నేనూ చూస్తాను. కోర్టులోనే సమాధానం చెబుదువుగాన్లే..." వళ్లుమండిపోతూవుంటే, కోపంగా అన్నాడు సీతారామయ్య.

పద్మకి, వీళ్ళ సంభాషణ సారాంశం, అర్థంగాకపోయినా, యేదో రభస జరుగుతున్నదని ఆమె పసిగట్టింది. తెల్లబోయింది.

"మీ యిష్టం వచ్చినట్లు చేసుకోండి. మీకు కావాల్సిన జవాబు కోర్టులోనే నేనూ యిస్తాను" అంటూ ముందుకు రాబోయాడు.

"ఆగు..." పిడుగుపాటులా అన్నాడు రామస్వామి.

రామనాథం నివ్వెర పోయాడు. అప్పుడే జానకి లోపల్నించి వచ్చి తలుపుదగ్గరే నుంచుని భర్తనూ, అతని ప్రక్కనవున్న వనితనూ చూసి, చలించి పోయింది. ఆమెకి యేడుపువచ్చింది. కళ్ళు ఒత్తుకుంది. పద్మ, జానకిని చూసింది. భాష తెలీకపోయినా జానకి యేడుస్తూఉండటం, ఇక్కడ వీళ్లు ఘర్షణపడుతూ ఉండటమూచూసి ఆమెకి కొంత అర్థమయ్యింది పరిస్థితి. ఆ అమ్మాయి రామనాథం భార్య అయి వుంటుందని వూహించుకుందుకు, యెక్కువ సమయం పట్టలేదు. అయినా, అప్పుడు నోరు మెదపదల్చుకోలేదు.

రామస్వామి కొడుకుని వుద్దేశించి అన్నాడు—

"నువ్వు యిప్పుడొక పెద్ద ఉద్యోగివి అయ్యావని, నీకు నువ్వే పెద్దవాడివన్న మాట! పెద్దల మాటలు, నీ ముందు గడ్డిపోచలన్నమాట! ఎంతగా మారిపోయావురా? జానకికి యేం లోటుందని తిరస్కరిస్తున్నావు? ఆమె కురూపి కాదే! అయినా నీలో ఈ మార్పు ఎలా వచ్చిందిరా? నీ ఉద్యోగంలో అంతస్తే ఇందుకు కారణమా? నిజానికి గృహిణికి కావల్సిం దేవిటి? రూపం, చదువు, అంటావా? కాదు. ఇవి అవసరమైనా, వీటికంటె అత్యావసరమైనది మరోటివుంది...మంచి మనస్సు!

జానకిని నువ్వు పూర్తిగా అర్థం చేసుకోలేక, తప్పుత్రోవ పడుతున్నావు. ఆమెకి అన్యాయం చేసిన నీకు యీ యింట్లో స్థానంలేదు. నీత్రోవ నువ్వుచూసుకో!" నిశ్చలంగా అన్నాడు.

రామనాథం తెల్లబోయాడు. తండ్రి అంత నిష్కర్షగా, కటువుగా ప్రవర్తిస్తాడని, అతనెప్పుడూ ఊహించలేదు. కోపంతో గుండెలు జ్వలించాయి. కాని, యేం చెయ్యగలడు?

"పద్మా, లెటజ్ రిటర్న్ బేక్" అంటూ ఆమె చేతిని పుచ్చుకుని చర్రున వెనక్కి తిరిగాడు.

పద్మకి అంతా వింతగా తోచింది. తన వూహే సరైనదని, ఆమెకి అనిపించినా, ఆ భాష తెలిసివుంటే యెంత బాగుండివున్ను... అనుకుందికూడా. అయితే, ఆ పరిస్థితుల్లో అక్కణ్ణించి తప్పుకోవడమే శ్రేయస్కర మన్పించింది ఆమెకి. మారు మాటాడకుండా, రామనాథం వెంట నడిచింది.

కొడుకు వెళ్ళిపోతున్న వేపు చూసి, కంటతడి పెట్టు కున్నాడు రామస్వామి. కొడుకుమీద ఆపేక్ష, అభిమానమూ, అవుతే వున్నాయి. కాని, జానకికి అన్యాయం జరుగుతూవుంటే, చూడలేని సహృదయమూ వుంది.

సీతారామయ్య కళ్లు చెమ్మగిల్లాయి. ద్వారం కేసి దృష్టిని సారించాడు. జానకి బావురుమంటూ లోపలికి వెళ్ళిపోవడం చూసి, అతని హృదయం ద్రవించిపోయింది.

రామస్వామి, భారంగా అడుగులు వేసుకుంటూ వచ్చి లోపల కుర్చీలో కూలబడ్డాడు. సీతారామయ్య, అతనికి యెదురుగా వున్నాడు.

"ఎంత ఘోరం జరిగింది. బావగారూ!" అన్నాడు సీతారామయ్య.

"జానకిపట్ల అభిమానం తక్కువయ్యిందనే అనుకున్నాం గాని, వాడు యింత అన్యాయం చేస్తాడని వూహించలేకపోయాం. వాడి తండ్రినని చెప్పుకుందుకు, నాకే సిగ్గుగా వుంది బావగారూ!" నిస్పృహతో అన్నాడు రామస్వామి.

"జానకికి అన్యాయం జరుగుతుంటే నేనూ చూస్తూ వూరుకోగలనా? అదెప్పుడూ జరగదు, కోర్టులో కేసు పెడితే, అతడే దారికి వస్తాడు."

రామస్వామి నిట్టూర్పు విడిచాడు. వర్షపు జల్లు అధికమైంది. రివ్వున గాలి వీచడం ప్రారంభించింది.

"మా వంశ గౌరవం మంటగలిసే రోజులు వచ్చాయి బావగారూ! ఏం చేస్తాం? ఇదంతా నా దురదృష్టం. బ్రతికివుండి యివన్నీ చూడాల్సి వచ్చింది" అన్నాడు బాధగా.

"అమ్మాయిని తీసుకుపోతాను బావగారూ!" అన్నాడు సీతారామయ్య సజల నేత్రాల్ని ఒత్తుకుంటూ.

రామస్వామి, అతని కేసి జాలిగా చూశాడు. "నేను యేం చెప్పగలను బావగారూ! మీ యిష్టం. మీకు యేది

న్యాయమని తోస్తే, అదే చెయ్యండి. తల్లిపోయిన తర్వాత, వాణ్ణి ఎంత గారాబంగా పెంచానో నాకు తెలుసు. అందుకు ప్రతిఫలముగా, నాకు యీ మనోవ్యథ ప్రసాదించాడు. ఇంకా, నేను ఎటువంటి ఘాతాల్ని తట్టుకోవల్సివుందో, ఆ భగవంతుడికే తెలియాలి" అన్నాడు భారంగా నిశ్వాసాన్ని విడుస్తూ.

క్షణం నిశ్శబ్దం. జానకి లోపల్నించివస్తూ, చీర చెంగుతో కన్నీరు తుడుచుకొంటూ,

"నాన్నా!" అంది. ఆమె గొంతులో జీర యేర్పడింది.

సీతారామయ్య, ఆమె కేసి చూశాడు. "ఏమమ్మా!" బాధగా అన్నాడు. "పోదాం పదమ్మా! అందుకే వద్దంటే, నువ్వు ఒప్పుకున్నావు కాదు. ఇప్పుడు ఆ వేదనని పెంచుకున్నావు."

"అదంతా నా దురదృష్టం నాన్నా! ఒకరి ఖర్మానికి, మరొకరు యెందుకు బాధ్యులు కావాలి?... మీరు వెళ్ళండి నాన్నా! నేను ఇక్కడేవుంటాను. కోర్టులు కేసులు వద్దు. అది అందరికీ తలవంపు తెచ్చిపెడుతుంది. ఎప్పటికైనా ఆయనలో మార్పు వస్తుందన్న నమ్మకం నాకు వుంది. ఆరోజు వచ్చే వరకూ, నేను మామగారి దగ్గరే వుంటాను మామగారు మరింత దిగులు పడుతున్నారు. ఈయనకి యెవరున్నారు చెప్పు నాన్నా! నా గురించి మీరేమీ దిగులు పడకండి..."

రామస్వామి, కోడలు కేసి ఆశ్చర్యంగా చూశాడు. అతని కళ్ళు ఆనందంతో మెరిశాయి. ఆమె మొహంలో

యేవిధమైన బాధ, నిరాశ అగుపించలేదు. ఆమెకి దగ్గరగా వెళ్లి తల నిమురుతూ,

"అమ్మా! నీ మనసుని అర్థంచేసుకోలేక పోయాడమ్మా ఆ రాక్షసుడు. చదువూ, సంస్కారం, అందం వీటన్నిటికంటె విలువైనది, మనస్సేనన్న విషయం వాడు గుర్తించలేదు. ఎప్పటికైనా భగవంతుడు నీ పక్షానే వుంటాడమ్మా! తప్పదు" అన్నాడు. అతని కళ్ళల్లో ఆనందబాష్పాలు గిర్రున తిరిగాయి.

సీతారామయ్య తృప్తిగా నిట్టూర్పువదిలాడు. కూతురు అలా చెప్తుంటే, మొండిపట్టుపట్టడం మంచిది కాదనుకున్నాడు.

"అయితే బావగారూ, నేను వెళ్లొస్తాను."

"భోజనంచేసి వెళ్ళండి" అన్నాడు రామస్వామి.

సీతారామయ్య కాదనలేకపోయాడు.

* * *

కలకత్తా చేరుకున్న తర్వాత పద్మ రామనాథంకి చెప్పకుండా తమఇంటికి వెళ్ళిపోయింది. ఆమె తన ప్రేమను రామనాథంముందు వదిలేసి ఓ ఉత్తరంకూడా టేబిలుమీాదపెట్టి వెళ్ళిపోయింది.

సాయంత్రం రామనాథం యింటికి వచ్చి చూసేసరికి పద్మ కనిపించలేదుగాని, ఆమె ఉత్తరం కనిపించింది. తీశాడు. ఇంగ్లీషులో రాసివుంది. దానిసారాంశం యిది:

'రామనాథంగారూ :

ఒకవిధంగా మీరు నన్ను వంచించారనే చెప్ప వచ్చు. మీకు ఇంతకుముందే వివాహ మయ్యిందన్న నిజాన్ని కప్పి పుచ్చారు. ఇందులో మీ స్వార్థం యేమిటో నాకూ బోధపడ లేదు. మరొక స్త్రీకి అన్యాయంచేసి, నేను మీ జీవితంలో ప్రవేశించడం, నాకు యిష్టంలేదు. నా హృదయం అంత కఠినం కాదు. అంతేకాదు, ఇన్నాళ్ళూ మీ మీదున్న నమ్మకం యిప్పుడు నాలో చెదిరిపోయింది. ఎప్పుడో ఓసారి నన్నూ మీరు వంచించరన్న నమ్మకం యేముంది? మీకు స్త్రీ మనసుతో పనిలేనప్పుడు, ఏదో ఒక అవాంతరం వస్తూనే వుంటుంది. అందుకే, నేను మీకు దూరమవుతున్నాను. నన్ను కలియ డానికి మరెప్పుడూ ప్రయత్నించకండి. మీ భార్యను చేరదీసి, మీ జీవితాన్ని సరిదిద్దుకోండి. ఇంతకంటె, నేనేం రాయగలను?

మీ శ్రేయోభిలాషిణి,

పద్మ...'

రామనాథంకి మొహం తిరిగినట్టయ్యింది. అలా కుర్చీలో కూలబడిపోయాడు. పద్మ రాసిన ఉత్తరంలోని విషయాలన్నీ చెవుల్లో గింగురు పెట్టాయి. పద్మను పోగొట్టుకున్నందుకు ఎంతో బాధపడ్డాడు. అదేసమయంలో ఆమె తనలో నిద్రపోయిన మానవత్వాన్ని మేల్కొల్పినందుకు సంతోషించాడు. నిజమే! జానకిమనస్సు తెలుసుకోలేకపోయా నిన్నాళ్ళు. తత్ఫలితంగా తనవాళ్ళందరికీ ఆవేదన కలిగించాను. ఇప్పటికి మించిపోయింది

లేదు. ఇప్పుడే వెళ్ళి, జానకికి క్షమాపణ చెప్పుకోవాలి ... అనుకున్నాడు. పద్మ ఉత్తరం అతనిలో ఎంతో మార్పు తెచ్చింది. మరునాడే బయలుదేరాలని నిశ్చయించుకున్నాడు. కాదు— ఉద్యోగానికి రాజీనామా యిచ్చి వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాడు. ఎక్కడైనా తనకి ఉద్యోగం దొరక్కపోదన్న ధీమా వుందిమరి!

* * *

తలుపులు తట్టిన శబ్దంవిని, తలుపుతీసింది జానకి. రామనాథంనిచూసి ఆశ్చర్యపోయింది. సిగ్గుతో తలవంచుకుంది. రామనాథం, భార్యకేసి పరీక్షగా చూశాడు. కాస్తంత చిక్కిపోయినట్టు అగుపించింది.

సామాన్లు యింట్లో పెట్టించి "నువ్వొ ఇక్కడేవున్నావా జానకీ!'' అన్నాడు రామనాథం. భర్త అంతసౌమ్యంగా మాట్లాడినందుకు, మురిసిపోయింది మనసులో.

"మామగారు యీ మధ్య నంతా అనారోగ్యంతో తీసుకున్నారు. ఇప్పుడిప్పుడే కాస్త కోలుకుంటున్నారు" అంది. ఆ జవాబు భర్త ప్రశ్నకి సంబంధించింది కాదని ఆమెకి తెలుసు. అయినా, అలానే చెప్పాలనుకుంది.

"ఏం ? ఏమయ్యింది ?"

"మీరు ఆరోజు వెళ్ళిపోయిం దగ్గర్నించీ, మామగారి ఆరోగ్యం బాగా దిగజారిపోయింది."

రామనాథం, గబగబా లోపలికి పోయాడు. జానకి, అతనివెంట నడిచింది.

"నాన్నా! నాన్నా!...నేను వచ్చేశాను నాన్నా!" అన్నాడు రామనాథం.

రామస్వామి కళ్ళు తెరిచాడు. కొడుకును చూడగానే, అతనికళ్ళు మెరిశాయి. చుట్టూ కలయజూశాడు. అతనిదృష్టికి, జానకే అగుపించింది గాని, అతను వెదుకుతున్న వ్యక్తి కనిపించలేదు.

"నాకు! వంట్లో బాగులేదని నీకు యెలా తెలిసిందిరా?" నీరసంగా ప్రశ్నించాడు.

"నాకు యీ విషయమే తెలీదు నాన్నా! నేను అక్కడి వుద్యోగం వదులుకొని వచ్చేశాను."

"ఏం? మీ ఆవిడ ఒప్పుకుందా?"

రామనాథం ఓ నిట్టూర్పు విడిచాడు.

"నాన్నా! స్త్రీలో ఎంతసహనం, త్యాగం వున్నాయో, పద్మ నిరూపించింది నాన్నా! మన భాష ఆమెకి అర్థంగాక పోయినా ఆరోజు ఇక్కడజరిగిన సంఘటన ఆమె మర్చిపోలేదు. అర్థం చేసుకుంది. అందుకే, జానకికి అన్యాయం జరగడం మనస్కరించక తనే నా జీవితంనుండి తొలిగిపోయి, నాలోని మానవత్వాన్ని మేల్కొలిపింది. ఆమెవల్లనే నా మనసుమారిందని

చెప్పాలి. అందుకు మనమంతా ఆమెకి కృతజ్ఞత తెలపాలి" అన్నాడు మొహం దించుకుని.

జానకి మొహం వికసించింది. ఆమె హృదయంలో అలముకున్న తమస్సు, పటాపంచలయ్యింది. నయనాలు ఆనంద బాష్పాలతో మెరుస్తున్నాయి. రామస్వామి ఆమె ఆనందాన్ని గమనించకపోలేదు. అతనూ మురిసిపోయి, మందహాసం చిందించాడు.

జానకి సిగ్గుపడిపోయి, అక్కణ్ణించి జారుకుంది.

"ఒరేయ్ అబ్బాయ్! యీ రోజు నాకు ఎంతో ఆనందంగా వుందిరా! పద్మకి ఉత్తరంరాయి మనందరి అభినందనలు తెలుపుతూ. ఆమెను ఓసారి యిక్కడికి రమ్మని ఉత్తరం రాయి. అన్నట్టు మీమామగారికి ఓ ఉత్తరంరాసి పడేయ్‌రా! అరె...నా నీరసమంతా మంచుముక్కలా కరిగిపోయిందేమిటి!" మెల్లగా లేచికూచున్నాడు రామస్వామి.

రామనాథం వుప్పొంగిపోయాడు. దూరంగా యెక్కడో గుడి గంటలు వినిపించాయి.

"శుభం" అన్నాడు – రామస్వామి మందహాసంతో.

రామనాథం, ఆనందోత్సాహాలతో అక్కణ్ణించి వంటగదికేసి వెళ్తుంటే, ద్వారందగ్గరే నుంచున్న జానకి అతని ఒళ్ళో వాలిపోయింది. ఆమెను దగ్గరగా తీసుకున్నాడు రామనాథం.